
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 30 ఆగస్టు 2024

5

తిరుపతి





ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజుకు వేమన పురస్కారం అందజేస్తూ...



జిల్లాకు జ్వరమొచ్చింది..!

ఫీవర్.. ఫియర్ !

ఉమ్మడి జిల్లాలో 3వేలకు పైగా బాధితులు

డెంగీ 120, చికున్‌గున్యా 74, మలేరియా 6

పక్క ఫోటోలోని వ్యక్తి పేరు మురళి రెడ్డి. పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. కాళ్లు చేతుల్లో వణుకు మొదలైంది. నడవడానికి తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి. స్థానికంగా ఉన్న ఆసుపత్రుల చుట్టూ తిరిగినప్పటికీ ఉపయోగం లేకపోయింది. చేతిలో ఉన్న సొమ్ము 30 వేలు కాస్త ఖర్చయిపోయింది. తెల్ల రక్త కణాలు తగ్గిపోయాయి. మరో వైపు ఆయాసం. ఊపిరి తీసుకోలేని పరిస్థితి.ఈలోపు తీవ్ర అనారోగ్యంతో కదలలేని పరిస్థితుల్లో తిరుపతి రుయాకు వచ్చారు.

ఈ ఫొటోలో వున్న వ్యక్తి పేరు రామచంద్ర. మూడు రోజులుగా జ్వరం వచ్చింది. ఆర్ఎంపి వైద్యుల దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గకపోగా, ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చింది. ఒళ్లంతా తీవ్రమైన నొప్పులు. చేతి వేళ్ళు, కాలి వేళ్ళు, మడమల వద్ద భరించలేనంత నొప్పితో ఆసుపత్రి పాలయ్యారు. ప్రస్తుతం రుయాలో కోలుకుంటున్నారు.

రేణిగుంట సమీపంలోని ఓ ప్రముఖ కంపెనీలో శ్రీనివాసులు అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల నుంచి తనకు జ్వరం ఉందని, సెలవు కావాలని యాజమాన్యాన్ని కోరాడు. కానీ ఉన్నట్టుండి సెలవు అంటే కుదరదు అంటూ మేనేజర్ తెగేసి చెప్పాడు. ఆ జ్వరం తోనే బుధవారం ఉదయం ఫ్యాక్టరీలోకి యధావిధిగా పనికొచ్చాడు. ఒళ్లంతా నొప్పులు వున్నాయని, సహచరులకు చెప్పిన కొంతసేపటికే కళ్ళు తిరిగి కింద పడిపోయాడు. లేవలేని పరిస్థితికి చేరుకున్నాడు. అతని పరిస్థితిని గమనించిన మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఇతరత్రా రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు వైరల్ ఫీవర్గా తేల్చారు. ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ పాతిక వేలకు పైగా ఖర్చు అయినట్లు తెలుస్తోంది.



ప్రజాశక్తి - తిరుపతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విషజ్వరాలు విజంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో సగటున ఒకరిద్దరికి పైగా జ్వరపీడితులు ఉన్నారు. జూన్ నుంచి రెండు జిల్లా కేంద్రాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో వేలాది మంది చికిత్స కోసం చేరుతున్నారు. ప్రస్తుతం జ్వరం తగ్గక గొంతునొప్పి, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్న కొందరిలో రక్తఫలికలు (ప్లేట్లెట్స్) తగ్గుతున్నాయి. ఓవైపు చికున్‌గున్యా, మరోవైపు డెంగీ, ఇంకోవైపు మలేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వాతావరణ మార్పులు ఒక వైపు.. పారిశుద్ధ్య లోపం మరోవైపు ప్రజలను రోగాలపాలు చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రోగులు దవాఖానకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా, ప్రైవేటు దవాఖానలకు కాసులు కురిపిస్తూ పేదల జేబులకు చిల్లులు పడుతుండటం గమనార్హం.

డెంగీ డేంజర్ బెల్స్

ఉమ్మడి జిల్లాలో డెంగీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా 736 కేసులు నమోదైనప్పటికి వాస్తవంగా 1200 కి పైగా డెంగీ పాజిటివ్ అని తెలుస్తోంది. ఒక్క తిరుపతి జిల్లాలో అధికారికంగా 201 డెంగీ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొంటున్నారు. మూడు కేసులు డెత్ అయినప్పటికీ గూడూరు ప్రాంతంలోని డక్కిలి, గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి మాత్రమే డెంగీతో చనిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.



ఇన్ పేషంట్లుగా జ్వరపీడితులు

రుయా, స్విమ్స్‌లో రోజుకి 400 కి పైగా బాధితులు

తిరుపతిలోని రుయా ఆసుపత్రికి రోజుకు సుమారు 150 నుంచి 200 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్న వారే వస్తున్నారు. ఇక స్విమ్స్ ఓపి లకు మరో 250 మందికి పైగా జ్వరపీడితులు వస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ తిరుపతి నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రిల్లో మరో 500 మందికి పైగా జ్వర పిడుతులు ప్రతిరోజూ చికిత్స పొందే పరిస్థితి నెలకొంటుంది. తిరుపతి నగరం, రెడ్డి రెడ్డి కాలనీలోని ఓ ప్రముఖ జ్వరాల డాక్టర్ వద్దకే రోజుకు 90 నుంచి 110 కేసులు వస్తుండటం గమనార్హం. ఇక ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీహెచ్ సి, సి హెచ్ సి లు, ఏరియా , ప్రధాన ఆసుపత్రుల్లో రోజుకి సుమారు 3 వేల మందికి పైగా ప్రతిరోజూ జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్య వర్గాలే పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిల్లో మందులు కొరత ఉండటంతో ఏ జ్వరం వచ్చినా నాలుగు పారాసిటమాల్ మాత్రలిచ్చి సరిపెడుతున్నారంటూ ప్రజా సంఘాల నేతలు వాపోతుండడం గమనార్హం.

ఫ్రైడే.. డ్రైడే నిర్వహిస్తున్నాం: డాక్టర్ శ్రీహరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి ఆవరణలో ఉండే పూలతొట్టీలు, డ్రమ్ముల్లోని నీటిని తొలగిస్తున్నాం. మురికి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలి. లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందకూడదు. వైద్యులను సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోవద్దు. జ్వరం తీవ్రత మేరకు పరీక్షలు చేయించుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో....

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చెత్త దిబ్బలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. రేణిగుంట-చెన్నై జాతీయ రహదారిని కలుపుతూ నిర్మితమౌతున్న రహదారిలో చెత్త గుట్టలు గుట్టలుగా ఉంది. ఇటుగా ప్రయాణించే వాహన దారులు, తిరుపతికి వచ్చే యాత్రికులు ఈ గుట్టలను చూసి నోరెళ్లబెడుతున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి పరిస్థితులు ఏంటో అని విమర్శించుకునే స్థాయికి చెత్త గుట్టలు చేరిపోయాయి. తిరుచానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఇలా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త గుట్టల కథ తెల్చాల్సిఉంది.



మార్కెట్‌లోకి టాటా నూతన ఎలక్ట్రిక్ కారు విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నాణ్యతా ప్రమాణాలకు పెట్టింది పేరైన టాటా మోటార్స్ ఎలక్ట్రికల్ కార్ల తయారీలోనూ తన పేరును చాటుకుంటోంది. తాజాగా టాటా కర్వ్ ఎలక్ట్రికల్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. తిరుపతి నగర పరిధిలోని విజయ భారతి ఆటోమోబైల్స్‌లో గురువారం తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి ఆదినారాయణ ముఖ్య అతిధిగా కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ భారతి ఆటోమోబైల్స్ ఎండీ సభాపతి వెంకటరమణ మాట్లాడుతూ కేవలం 15 నిముషాల ఛార్జింగ్‌తో 150 కిలో మీటర్లు దూరం ప్రయాణించవచ్చన్నారు. 6 ఎయిర్ బ్యాగ్స్‌తో దూర ప్రాంతాల ప్రయాణానికి అనువైన వాహనంగా టాటా కర్వ్‌ను చెప్పవచ్చన్నారు. రెండు వేరియంట్లతో టాటా కర్వ్ వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. కారుకు అమర్చిన బ్యాటరీ, మోటార్ 8 సంవత్సరాలు, వాహనానికి 3 సంవత్సరాలు వారెంటీలు ఉన్నాయన్నారు. జిల్లా రవాణాశాఖాదికారి ఆదినారాయణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాలకు ఛార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కారు ప్రారంభ కార్యక్రమంలో టాటా కస్టమర్ కేర్ విభాగ ఇన్‌ఛార్జ్ హరివెంకటేష్, ఎస్బీఐ తిరుపతి రీజియన్ మేనేజన్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇండియన్ బ్యాంక్ ఛీఫ్ మేనేజర్(రిటైల్ ప్రోసెసింగ్ సెంటర్) లలిత, ఆటోమోబైల్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

టిటిడిలో వాటాలు సరే...సామాన్యుల మాటేంటి..?

శ్రీవారి మెట్టు వ్యాపారులకు కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి – తిరుపతి టౌన్

టిటిడిలో వాటాల గురించి కొట్లాటలు మాని, సామాన్యుల గురించి పట్టించుకోవాలని టిడిపి కూటమి నేతలకు కార్మిక సంఘాలు హితవు పలికాయి. సిఐటియు ఆధ్వర్యంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు టిటిడి పరిపాలనా భవనం వద్ద సాగిస్తున్న నిరసన దీక్ష గురువారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర అధ్యక్షతన జరిగింది. సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రదధాన కార్యదర్శులు కందారపు మురళి, కె.రాధాక్రిష్ణ మాట్లాడుతూ తిరుమల కొండపై రాజకీయాలు వద్దంటూనే రాజకీయ నేతల చేతుల్లో నిర్ణయాలు బందీగా మారిపోయాయని ఆరోపించారు. ఆఖరికి తట్టలు పెట్టుకుని అమ్ముకునే వ్యాపారుల నుంచి పైస్థాయి టెండర్ల వరకూ వీరి జోక్యం లేకుండా ఏమీ సాగడం లేదన్నారు. శ్రీవారి మెట్టు వ్యాపారులు గత 20 ఏళ్లకు పైగా శ్రీవారి మెట్టు మార్గంలో సమోసాలు, బొరుగులు, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్, కుంకుమ భరిణలు వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని టీటీడీ యాజమాన్యానికి పలురకాలుగా ఉపయోగపడుతున్నారని ప్రస్తావించారు. టీటీడీ ఈవో శ్యామలరావు సామాన్యుల గురించి పట్టించుకోవాలని కోరారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు జి.బాలసుబ్రమణ్యం, టి.సుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, జి.చినబాబు, పి.హేమలత, ఆర్.లక్ష్మి, డిఎంసి భాస్కర్, మునిరాజ, బుజ్జి, రవి, గంగులప్ప మద్దతు ప్రకటించారు.


పాన్ చెరువు ఆక్రమణలు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వినాయక సాగర్ సమీపంలో ఆక్రమణకు గురైన పాన్ చెరువును గురువారం సిపిఎం నేతల బందం పర్యటించి పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిమ్మి నాయుడుపాలెం సర్వే నెంబర్ 84 లో ఉన్న పాన్ చెరువును అధికారాన్ని అడ్డం పెట్టుకొని కోట్లాది రూపాయలు విలువ చేసే చెరువు భూమిని ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన చెరువును రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన చెరువును కాపాడకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే వేణుగోపాల్, ఎం మాధవ్, పి బుజ్జి, నగర కమిటీ సభ్యులు ఎం నరేంద్ర, ఏ రాధాకష్ణ, ఆర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కౌలు కార్డ్‌దారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి టౌన్ : జిల్లాలో నకిలీ కౌలుకార్డులు పొందిన వారిని కఠినంగా శిక్షించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుసంఘం పోరాటాల ఫలితంగా కౌలుదారులకు పంటకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పెట్టుబడి సాయానికి వచ్చే రూ.20 వేలను సులభంగా కొట్టేయడానికి కౌలుదారుల అవతారం ఎత్తి ప్రజాధనం కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది 7348 కౌలుకార్డులు ఉంటే, ఈ ఏడాది 9494 నమోదయ్యాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు అర్హులకు మాత్రమే కౌలుకార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

తిరుపతి సిటి : తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ కట్టలో పనిచేయు శ్రీవారి కళ్యాణ కట్ట నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పీస్ రేట్ వర్కర్స్ గా పని చేస్తూ ప్రస్తుతం 20 వేల రూపాయలు తీసుకుంటున్న వారికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 25వేల రూపాయలు అమలు కాబోతున్న సందర్భంగా అలిపిరి వద్ద కొబ్బరికాయలు కొట్టారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి కల్యాణ కట్ట నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పి శ్రీహరి, కార్యదర్శి జి ప్రసాద్, శ్రమశక్తి అవార్డు గ్రహీత రాధాదేవి పాల్గొన్నారు.

శ్రీవేటూరి ప్రభాకర్‌శాస్త్రికి నివాళి

తిరుపతి సిటి : తిరుమల శ్రీవారిపై అన్నమయ్య రచించిన సంకీర్తనలను అనువదించి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవం విశ్వవ్యాప్తం కావడానికి కషి చేసిన మహనీయుడు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి అని ఎస్వీయు తెలుగు విశ్రాంతాచార్యులు ఆచార్య సర్వోత్తమరావు అన్నారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి 74వ వర్ధంతిని గురువారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ వేటూరు ప్రభాకర శాస్త్రి మిత్ర మండలి వేణుగోపాల్, ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి, ప్రచురణల విభాగం ఉప సంపాదకులు డా. నరసింహచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సూపరింటెండెంట్ కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే వాయిదా..అక్రమార్కులకు ఊరట!

రాజీవ్‌నగర్ అక్రమాల కథ కంచికేనా..!

సూత్రధారులపై చర్యకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగిపోతున్న శ్రీకాళహస్తి శివారు ప్రాంతం రాజీవ్ నగర్ భూ అక్రమాల సమగ్ర సర్వేకు బ్రేకు పడింది. శుక్రవారం నుంచి 57 బందాలతో అధికారులు రాజీవ్ నగర్ లో సర్వే చేపట్టాల్సి ఉంది. అయితే ఆదిలోనే హంసపాదు అన్న చందంగా ఈ నెల 31వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి పూనుకోవడంతో సమగ్ర సర్వేకు కాస్త విరామం ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో తమ అక్రమాల నిగ్గు ఎక్కడ బట్టబయలవుతుందోనని ముచ్చెమటలు పడుతున్న అక్రమార్కులకు కాసింత ఊరట లభించిందని అనుకుంటున్నారు. కానీ సింహం ఒక్క అడుగు వెనక్కి వేస్తే వెనక్కి తగ్గినట్లు కాదనీ, వాయిదా పడ్డ రోజుల్లో మరింత సమాచారం చేతబట్టుకుని సమగ్ర సర్వేలో దూకుతామంటూ అధికారులు హెచ్చరిస్తుండటం గమనార్హం. అయితే అక్రమార్కుల ఒత్తిడి వల్లే సర్వే వాయిదా పడిందా? అని చర్చ నడుస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజీవ్ నగర్ అక్రమాలపై



కూల్చివేత ఫైల్‌ఫోటో

ప్రధానంగా దృష్టి సారించింది. ముఖ్యంగా రాజీవ్ నగర్ వెంబడి ఉన్న రహదారి ఆక్రమణలు కూల్చి అక్రమార్కులకు హెచ్చరికలు జారీ చేసింది. ఆ నాటి నుంచి నేటి వరకు రాజీవ్ నగర్ లో భూ అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలెవ్వరినీ వదిలిపెట్టబోమంటూ స్థానిక ప్రజాప్రతినిధి స్పష్టం చేశారు కూడా. ఈ నేపథ్యంలోనే 57 మంది బందాలతో సమగ్ర సర్వే అంశం తెరపైకి వచ్చింది. అయితే అంతకంటే ముందు 2005 నుంచి 20024 వరకు రాజీవ్ నగర్ భూ అక్రమాల్లో పాలు పంచుకున్న రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, హౌసింగ్ అధికారులపై ముందస్తు చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాజీవ్ నగర్ భూ అక్రమాలకు కథా, రచన, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించింది మొత్తం రెవెన్యూ అధికారులే కదా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ప్రశ్నించారు. దాదాపు రెండు దశాబ్దాల కాలంగా నాలుగు ప్రభుత్వాల హయాంలో రాజీవ్ నగర్ భూ అక్రమాల పాపపు చిట్టా పెరుగుతూ వస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తూ వచ్చారో..! అప్పటి ప్రజాప్రతినిధులు ఎందుకు అక్రమార్కులకు కొమ్ముగాసారో ముందు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాజీవ్ నగర్ ఓ అక్షయపాత్ర లాగా 2005 నుంచి ఆ పరిధిలో పనిచేసిన కొందరు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆయా ప్రభుత్వాల పరిధిలో ఉన్న రాజకీయ నేతలతో కలిసి ప్లాట్ల వ్యాపారం చేశారంటూ ఆరోపణలు చేశారు. రెవెన్యూ అధికారుల అండదండలు లేకుండానే అక్రమార్కులకు ఇంటి పన్నులు, విద్యుత్ సర్వీసులు, మౌలిక సదుపాయాలు ఎలా కల్పించారని సిఐటియు నాయకులు ప్రశ్నిస్తున్నారు. రాజీవ్ నగర్ లో సమగ్ర సర్వే చేసే ముందు రాజీవ్ నగర్కు అనుబంధంగా పనిచేసిన అధికారులపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. అప్పుడే రాజీవ్ నగర్ భూ కుంభ కోణంలో అసలైన సూత్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారని సూచించారు.

సాకం నాగరాజుకు వేమన సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

సాహిత్యాన్ని నేటి విద్యార్థి లోకానికి కసింతైనా రుచి చూపించి వాళ్ల దారి పొడుగునా విజ్ఞాన పుష్పాలు పూయించాలని నిరంతర కషి చేస్తున్న సాకం నాగరాజుకు వేమన సాహితీ పురస్కారం సముచితమని ప్రఖ్యాత రచయిత్రి ఓల్గా అన్నారు. గురువారం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రం సమావేశ మందిరంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషా వికాసానికి గ్రాంథికం అవరోధమని వాడుక భాషా ఉద్యమానికి నడుంకట్టిన గిడుగు చిరస్మరణీయుడని ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంచాలకులు పి.సి.వెంకటేశ్వర్లు అన్నారు.మాత భాషమీద అభిమానం లేకుండా ఒక వ్యక్తి ఎదుగుదల అసాధ్యమని రాజా చంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గాప్రసాద్ అన్నారు. సభకు వెంకాయల దామోదరం అధ్యక్షత వహించారు. న్యాయవాది మట్లా పురుషోత్తం రెడ్డి, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఈమటం రామచంద్రా రెడ్డి, ఆకుల మల్లేశ్వరరావు, తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, రచయితలు పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, వాకా ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని సరళీకరించాలి

మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పిన వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, సామాన్యులకు అందుబాటులోకి తేవాలని, మాతృభాషను ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని వక్తలు ఉద్ఘాటించారు. తెలుగు భాషా దినోత్సవం, తెలుగు వ్యవహార భాష ఆధ్యుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ బన్సల్, డిఆర్ఒ పెంచలకిషోర్‌లతో కలిసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి 1863, ఆగస్ట్29 న శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేట గ్రామంలో వెంకమ్మ, వీర్రాజు దంపతులకు జన్మించారనీ తెలిపారు. తెలుగు భాషోద్యమానికి మూల పురుషుడని, బహు భాషా కోవిదుడని, వ్యవహారిక భాషకు ప్రాణం పోసిన వారని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారు ఎలాగైతే కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో వారి మాత భాషకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ అందులోనే మాట్లాడ్డం చూస్తున్నామని, మన రాష్ట్రంలోనూ మన కుటుంబాల్లో పూర్తి స్థాయిలో తెలుగులోనే మాట్లాడాలని అన్నారు. శ్రీకష్ణ దేవరాయలు మెచ్చి వారు తెలిపిన మాటలు దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలిపిన మాటలు గుర్తు చేశారు. అనంతరం కలెక్టర్ పలువురు తెలుగు భాషా కోవిదులను సముచితంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగాల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అప్పారావు తెలిపారు. తెలుగు ప్రజల సమృష్టి కృషితో తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలం కల్లివెట్టుఉ న్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు యువశ్రీ మురళి మాట్లాడుతూ తెలుగు భాష మన వారసత్వ సంపదని అన్నారు. ఏడో తరగతి విద్యార్థిని ఇందులాస్య తెలుగు తల్లి వేషధారణ అందరినీ అలరించింది. పల్లమాల ఉన్నత పాఠశాలలో ఎంఇఒ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాదెండ్ల మురళి, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్,దాసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బ్లూమింగ్ బడ్స్‌లో....

రామచంద్రాపురం : స్థానిక బ్లూమింగ్ బడ్స పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు తెలుగు తల్లి, గిడుగు వెంకట రామ మూర్తి, శ్రీ కష్ణ దేవరాయులు, వేమన వేషాధారణలతో చూపరులకు తెలుగు భాషా చరిత్రను తిరిగి గుర్తు చేసారు. విద్యార్థినీ విద్యార్థులు తెలుగు పద్యాలతో, తెలుగు పొడుపు కథలు లాంటి వాటితో స్వచ్ఛమైన తెలుగు పరిమళాన్ని అందరికి వివరించారు. ఈ సందర్భముగా పాఠశాల చైర్మన్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రాంథిక భాషలలో అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉన్న తెలుగుని అందరికి అర్థం అయ్యే రీతిలో మార్చారని తెలిపారు.

కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి ఆధ్వర్యంలో తెలుగు భాషా



దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం జరిగిందని హెచ్ఎం వాగ్దేవి తెలిపారు.

వెరిటాస్ సైనిక్ పాఠశాలలో తెలుగు భాష గొప్పతనాన్ని, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలుగు లో కవితలు , గీతాలు, నత్యాలు నుడికట్టు పదాలు,ప్రముఖ వ్యక్తుల వేషధారణతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువన విజయం, బుర్ర కథ, నాటక ప్రదర్శనలు అందరినీ విశేషంగా అలరించాయి. ఈ సందర్భం గా పాఠశాల చైర్మన్ డాక్టర్ బి శేషా రెడ్డి మాట్లాడుతూ కన్న తల్లి ,జన్మ భూమి ,మాత భాష ఈ మూడింటిని మరువ రాదు అని విద్యార్థులకు ఉద్బోధ చేశారు. ఈ కార్యమంలో పాఠశాల డైరక్టర్ శ్రీకర్ రెడ్డి, సారిక రెడ్డి, డీన్ ఎయిర్ కమోడోర్ (రి) సి జి హెచ్ ఖాన్ పాల్గొన్నారు

చంద్రగిరి శ్రీ చైతన్య పాఠవాలలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జమీల్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ పురుషత్తమ్, ప్రైమరీ ఇంచార్జ్ లు జ్యోతి, మీనా, రత్న ఉపాధ్యాయబందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో తెలుగుబాష, క్రీడా దినోత్సవం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. కార్యక్రమములో పిఈటి గోవిందరాజులు, తెలుగు ఉపాధ్యాయులు రాజేంద్ర, నవీన్ కుమార్, లక్ష్మీప్రభ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు వేంకట రామమూర్తికి నివాళి అర్పించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు.

పిచ్చాటూరు: మండలంలోని జిఎబిఆర్ కళాశాల నిర్వహించిన మన సంస్కతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకత్తా రెడ్డప్ప ఆధ్వర్యంలో జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ హేమమాలిని పాల్గొన్నారు.కార్యక్రమంలో కళా సంస్కతి సంస్థ మహిళ అధ్యక్షులు నాగమణి, లీల చౌదరి, జెబీఆర్ కరస్పాండెంట్ మునిరత్నం, ప్రిన్సిపాల్ భూలక్ష్మి ఏవో అంకయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో రాజవీధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆలూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష కన్నతల్లితో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ చంద్రశేఖర్ ,ప్రైమరీ ఇంచార్జ్ దివ్య ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు

గూడూరు టౌన్ : తూర్పువీధి ప్రాంతంలోని మినర్వా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పద్య, పఠన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విజేతలకు ఇన్నర్ వీల్ ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధులచే బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాం ప్రసాద్, తెలుగు ఉపాధ్యాయులు రమణ, ఉషా పాల్గొన్నారు.

పుత్తూరులో మెయిన్ స్కూలులో ఎంఇఒ తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. వడమాలపేట మండలం ఎంపియుపి పాఠశాలలో పోటీలను నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ఎపి రంగయ్య, చెంచులక్ష్మి పాల్గొన్నారు.



వెరిటాస్ సైనిక్ పాఠశాలలో...

గురుకులానికి మెష్ వితరణ



మెష్‌ను అందిస్తున్న దాత సుబ్బారావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని కాసాగార్డెన్ బాలికల గురుకుల పాఠశాలకు సీనియర్ పాత్రికేయుడు సీ.సుబ్బారావు గురువారం దోమల నివారణకు మొదటి అంతస్తు మొత్తానికి మెష్‌ను వితరణగా అందించారు. ఆ పాఠశాలలో ఏడవ తంగతి చదువుతున్న తన కుమార్తె గీతిక జన్మదినాన్ని పురస్కరించుకుని మెష్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. రానున్నది వర్షాకాలం కావడం.. దోమలతో విద్యార్థినిలు సతమతమయ్యే పరిస్థితుల నేపథ్యంలో మెష్‌ను అందించడం శుభ పరిణామమని ప్రిన్సిపాల్ ప్రభావతి అన్నారు. పట్టణానికి చెందిన కామి వెంకటేశ్వర్లు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని వేణుంభాకం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కృష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఆ తరువాత విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద గురువారం రాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త శ్రీలత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలో చదువుకుంటున్న చిన్నారులకు గర్భవతులకు చిరుధాన్యాలను ఇవ్వడం వల్ల చిన్నారుల ఎదుగుదల, గర్భవతులకు మంచి బలాన్ని ఇస్తుందన్నారు. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలు గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కల్పలత, జిల్లా నాయకులు రాజేశ్వరి, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజ్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

వెంకటనారాయణరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: జువ్వలపాలెం నీటి సంఘం మాజీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటనారాయణ రెడ్డికి నియోజవర్గానికి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు. ఇటీవల నాగిరెడ్డి వెంకటనారాయణరెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గురువారం ఆయన సంస్మరణ కార్యక్రమాన్ని చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరస వెంకటరత్నం, కొందరు టీడీపీ నాయకులతో కలిసి ఆయనకు నివాళులర్పించారు. ఆ తరువాత సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్థానిక వైసిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌డిసిసిబి సభ్యులు మాధవరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి బెంచీల వితరణ



ఆసుపత్రికి బెంచీలు వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు విశ్రాంత ఉపాధ్యాయురాలు విశాలాక్షి నాలుగు బెంచీలను గురువారం వితరణ చేశారు. తన భర్త మురళీ కృష్ణ ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు జనార్దన్ రెడ్డి ఓ సందర్భంలో ఆసుపత్రికి వెళ్ళగా ఆసుపత్రికి విచ్చేసిన పేద రోగులు నిలబడి ఉండటాన్ని చూసి ఆ దంపతులు టేకు కొయ్యతో ఒక్కొక్క బెంచి రు.14వేల చొప్పున రు.56000లు విలువైన నాలుగు బెంచీలను తయారు చేయించి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అరుణకి వితరణ చేశారు. వితరణ చేసిన విశాలాక్షి దంపతులకు ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, రోగులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు స్వర్ణలత, కీర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: నవ భారత్ సేవా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో కట్టకిందపల్లిలోని శిక్షణా కేంద్రం మహిళా వికాస్‌లో మహిళల చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి పోలీసు శాఖ నుంచి ఏఎస్ఐ గిరిజ, హెడ్ కానిస్టేబుల్ శాంతి, కానిస్టేబుళ్లు ఎల్లమ్మ, లలిత, అంజమ్మ, శ్రావణి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్త్రీలకు చట్టపరమైన హక్కుల గురించి ప్రసంగిస్తూ నేడు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు అందుకు కారణం అవుతున్న మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర దుష్ప్రభావాలు గురించి వివరించారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు 80999 99977కు లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రిగేట్ నెట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్‌పర్సన్ కె.త్రివేణి నాయుడు, నవ భారత్ సేవా సమాజ్ సిబ్బంది సురేఖ, అరుణ, అలేఖ్య, శివశ్రీ, సుజాత, వహీదా శిక్షణ పొందుతున్న మహిళలు భారీగా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం పరమేశ్వర మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమ భూషన్ రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కుష్ఠు వ్యాధి, డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ శెట్టి, చంద్ర, రమేష్, విజయ కుమారి, లలిత జమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: సెప్టెంబర్ 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం కోరారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు భవన సముదాయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ముందస్తు సమీక్షలో ఆమె పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ త్వరలో జరిగే లోక్ అదాలత్‌లో పోలీస్ స్టేషన్ల వారీగా ఉన్న కేసులు గుర్తించి కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గంలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని పోలీసులకు సూచించారు. ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు సులోచన రాణి, న్యాయవాదులు, డీఎస్పీ రమణ కుమార్, ఒకటో పట్టణ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'సచివాలయ ఉద్యోగులకు బదిలీల అవకాశమివ్వాలి'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు కోరారు. గురువారం ఏర్పేడుతో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థలోని అన్ని శాఖల ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన బదిలీలలో కూడా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమల శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, ఆరోగ్య శాఖకు సంబంధించిన వారికి బదిలీల అవకాశం కల్పించలేదన్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని, వారికి బదిలీల అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఇవ్వాలన్నారు.

డేటా స్పీడ్‌ను మెరుగుపరిచిన విఐ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: టెలికాం కంపెనీ విఐ (వోడాఫోన్) ఆంధ్రప్రదేశ్‌లోని తమ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేసినట్లు ఆ కంపెనీ బిజినెస్ హెడ్ ఆనంద్ దాని తెలిపారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,000 పైచిలుకు సైట్లలో లీట్ 2500ఎంహెచ్ జెడ్ బ్యాండ్‌లో స్పెక్ట్రంను 10నుంచి 20ఎంహెచ్‌జెడ్‌కి అప్‌గ్రేడ్ చేశామన్నారు. తద్వారా ఈ లేయర్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపునకు పెంచుకుందన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, చిలకలూరిపేట, విజయనగరం, మదనపల్లె, మంగళగిరి, నంద్యాల, శ్రీకాకుళం, గుంటూరు, హిందూపూర్, కడప, విశాఖపట్నం, విజయవాడ, నరసరావుపేట, ప్రొద్దుటూరు, తాడిపత్రి తదితర నగరాలు ఈ జాబితాలో ఉన్నట్లు చెప్పారు. ఈ అప్‌గ్రేడ్‌తో విఐ గిగానెట్ నెట్‌వర్క్‌పై కస్టమర్లు మరింత వేగవంతమైన డేటా స్పీడ్‌ను అందుకోగలరని వివరించారు. నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా, తమ వినియోగదారులకు మెరుగైన వేగాన్ని అందించి, వారి విశ్వసనీయతను పెంపొందించాలన్న విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఈ స్పెక్ట్రం అప్‌గ్రేడ్ చేశామని స్పష్టం చేశారు. డిజిటల్ ప్రపంచంలో తమ కస్టమర్లు ముందుకెళ్లేలా వారి కోసం సరికొత్త ఆఫర్లు, ప్లాన్లను కూడా ప్రవేశపెట్టిందని తెలిపారు. కొత్త అపర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలంరెడ్డి సేవలు మరవలేం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-డక్కిలి: డక్కిలి ఎంపిపిగా, టీడీపీ మాజీ మండల అధ్యక్షులుగా దివంగత పోలంరెడ్డి వెంకటరెడ్డి చేసిన సేవలు మరవలేమని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని మాటుమడుగు గ్రామంలో గురువారం జరిగిన వెంకటరెడ్డి ఉత్తరక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో ఆయన పాల్గొని ప్రసంగుంచారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శభాష్ ఎస్ఐ



ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్ సహకారంతో ద్వారకానగర్ కాజ్ వేకు గురువారం మరమ్మత్తులు చేపట్టారు. ద్వారకా నగర్ వద్ద అరుణా నదిపై నిర్మించిన సిమెంటు కాజ్ వే ధ్వంసమై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంగుండ పిచ్చాటూరు, నాగలాపురం మండలాలకు చెందిన ప్రజలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో పరిస్థితిని గుర్తించిన ఎస్ఐ దగ్గరుండి కేవీఎస్‌ఆర్ కంస్ట్రక్షన్ టిప్పర్లతో మట్టి తోలించి జేసీబీ సాయంతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దీంతో పిచ్చాటూరు, నాగలాపురం మండలాల ప్రజలు శభాష్ ఎస్ఐ అంటూ ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

ఎస్వీయూలో అడ్డదిడ్డంగా చెట్లను నరికివేత



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలో అడ్డదిడ్డంగా చెట్టు నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్‌లు మాట్లాడుతూ ఎస్వీయూలో 258చెట్లను నరికి వేయడానికి ఉపకులపతి ఉత్తర్వులు గత ఏడాధి డిసెంబరు 7న అప్పటి యూనివర్సిటీ ఇంచార్జ్ ఇంజనీర్ పేరుతో ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే నవంబరు 24న ఉపకులపతిగా రాజారెడ్డి పదవి కాలం పూర్తయిందని చెప్పారు. డిసెంబరు 27న నూతన ఉపకులపతిగా ఆచార్య శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారన్నారు. అయితే ఆయన పదవీ కాలం జూలై 18న ముగిసిందని, ఉపకులపతి పేరుతో ఆయన సంతకం లేకుండా ఉత్తర్వులు ఎలా ఇచ్చారో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికి వేయడానికి అనుమతి ఇచ్చిన మాజీ రిజిస్ట్రార్ హుస్సేన్, ఇంచార్జ్ ఇంజనీర్‌పై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎనిమిది నెలల క్రితం ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తుతం ఆ పని చేయడానికి ఎవరు అనుమతిచ్చారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు: అదనపు ఈవో



ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: దళారుల బెడదను అంతం చేయడమే లక్ష్యంగా శ్రీవారి భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదాలను మరింత పారదర్శకంగా విక్రయించేందుకు టీటీడీ చర్యలు చేపట్టినట్లు అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలో అన్నమయ్య భవనం వెలుపల మీడియా ప్రతినిధులతో గురువారం ఆయన మాట్లాడుతూ దర్శనం టోకెన్లు లేని భక్తులకు ఆధార్‌తో లడ్డూ ప్రసాదాలు విక్రయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో పాటు, కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానెల్‌లలో ప్రసారమవుతున్న నిరాధార ఆరోపణలు భక్తులు నమ్మవద్దని ఆయన కోరారు. సామాన్య భక్తుల ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

లడ్డూల రేషనింగ్ బ్లాక్ మార్కెటింగ్‌కి తోడ్పడుతుంది: కందారపు మురళి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: టీటీడీలో నేటి నుంచి అమలు చేయాలని భావిస్తున్న లడ్డూల రేషన్ విధానం చివరకు బ్లాక్ మార్కెటింగ్‌కి దోహదపడుతుందని టిటిడి ఉద్యోగ, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి చేసిన ప్రకటన సమంజసమైంది కాదని భక్తుల మనోభావాలకు భిన్నమైందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఈ అంశాన్ని తాము తెలియజేస్తున్నామని గతంలో కూడా ఈ రేషన్ విధానం కారణంగా విపరీతమైన బ్లాక్ మార్కెటింగ్ ఏర్పడిన విషయాన్ని యాజమాన్యం మరిచిపోయినట్టుందని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే తిరుమల కొండపై దళారుల దందా ఏ స్థాయిలో కొనసాగుతుందో క్యాబినెట్ సమావేశంలో ఓ మహిళా మంత్రి ముఖ్యమంత్రికి స్వయంగా ఫిర్యాదు చేసినా ఆ దందాకి బలం చేకూర్చేటట్టుగా టీటీడీ యాజమాన్యం ప్రకటనలు చేయటం ఏ రకంగానూ సమంజసం కాదని తక్షణం ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. భక్తుల మనోభావాలకు భిన్నంగా ఈ నిర్ణయం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

నాజియా భూమిని కాపాడాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-రేణిగుంట: తిరుపతి అర్బన్ అనాసంపల్లి మునిరెడ్డివారి అనుచరుల నుంచి నాజియా భూమిని కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం అమరావతి రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి విన్నవించారు. తిరుపతి అర్బన్ మండలం చెన్నాగుంట గ్రామంలో సర్వే నెంబర్ 222/4ఎ లో 57 సెంట్లు భూమి, సర్వే నెంబర్ 222/4సి 8 సెంట్లు భూమిని 2019 సంవత్సరంలో జయరామ్ అనే వ్యక్తి వద్ద నుండి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, ఆ భూమిని ఆనుకుని ఉన్న కాలవ పరంబోకు భూమిని ఆక్రమించుకొనుటకు పట్టా భూముల్లోకి రానివ్వకుండా అతనికి ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేయడంతో నాజియా భర్త మానసిక వేదనతో మృతిచెందాడని తెలిపారు. బాధితురాలు నాజియా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ముని రెడ్డి వారి తమ్ముడు పురుషోత్తం రెడ్డి కొంతమంది రౌడీలతో బెదిరిస్తున్నారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలి

- విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంచుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరికి క్రీడలు, వ్యాయామం భాగం కావాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన చంద్ జయంతి పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడల దినోత్సవం నిర్వహణ నేపథ్యంలో స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ నుంచి మహతి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్ర పటానికి కలెక్టర్ పూల మాల వేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ గొప్ప హాకీ ప్లేయర్ అని, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరిగిన ఒలింపిక్స్ క్రీడలలో వారి స్ఫూర్తితో 8గోల్డ్ మెడల్స్ సాధించడం ఒక ఎనలేని ఘనత అని తెలిపారు. ఈ నెల 26 నుంచి క్రీడా పోటీలు, ఇతర పోటీలు కళాశాలల్లో, పాఠశాలల్లో నిర్వహించి క్రీడలను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలోని టీచర్లు, పీఈటీలు క్రీడా మైదానాలు ఉన్నా లేకున్నా క్రమం తప్పకుండా విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలని కోరారు. స్పోర్ట్స్ స్టేడియంలో క్రికెట్, స్విమ్మింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్ కోర్టు వంటి పలు వాటిని కలెక్టర్ డిఎస్‌డిఓతో కలిసి పరిశీలించి పలువురు క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుమారి దండు పూజ ఇంటర్నేషనల్ షటిల్ ప్లేయర్, 73వ నేషనల్ గేమ్స్ గోవాలో మిక్స్ డబుల్స్ పోటీలో గోల్డ్ మెడల్ గ్రహీతను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, డీఈవో శేఖర్, జిల్లా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ ఎస్వీయు, డైరెక్టర్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కెఎంసిజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి ఎస్వీయూలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ సౌత్ జోన్ అండర్-14 బాల బాలికల పోటీల్లో పట్టణంలోని కాసాగార్డెన్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఐ.వాసంతి హై జంప్‌లో మొదటి స్థానం, జి.లాలిత్య, సీ.సుకన్య రన్నింగ్ లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో గురువారం నిర్వహించిన మాతృభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చూపి జాతీయస్థాయిలో సత్తా చాటాలని ప్రిన్సిపాల్ ప్రభావతి ఆకాంక్షించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి: వీసి



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు ఈ దశలో ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అని విసి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి అన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాభారతి, వర్సిటీల ఆధ్వర్యంలో వాక్థాన్ 3.0 ర్యాలీని నిర్వహించారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సహాయక డైరెక్టర్ ఉద్యోగులకు, విద్యార్థులకు మిక్స్ డబుల్స్ బ్యాడ్మింటన్, మిక్స్ టగ్ ఆఫ్ వార్ క్రీడల పోటీల్లో నిర్వహించి గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్యులు రజినీకాంత్ శుక్లా, చీఫ్-వార్డెన్ పి.వెంకట్రావు, ర్యాగింగ్ సెల్ నోడల్ ఆఫీసర్ డా.డి.జ్యోతి, ఎపిఆర్ఓ డా.కనపాల కుమార్, ఎడ్యుకేషన్ ఏఆర్ సాంబశివరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంస పత్రాలు



ప్రశంస పత్రాలు అందిస్తున్న ప్రవీణ్, డీఈవో శేఖర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంస పత్రాలను అందజేశారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు డాక్టర్ వై.ప్రవీణ్, డీఈఓ శేఖర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానందిస్తాయన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలను రాణిస్తూ దేశ ప్రతిష్ఠను ప్రపంచ దేశాల్లో ఇనుమడింపజేయాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా అంతకు ముందు జరిగినా ర్యాలీలో పాల్గొన్న సుమారు 2500 మంది క్రీడాకారులకు వై.ప్రవీణ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఓ సయ్యద్, ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ప్రొఫెసర్ శివ శంకర్ రెడ్డి, జయచంద్ర,, క్రీడాకారులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనలో నగరికి ప్రాధాన్యతివ్వండి

- మంత్రికి ఎమ్మెల్యే భాను వినతి



మంత్రికి విజ్ఞప్తిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పారిశ్రామికాభివృద్ధిలో నగరి నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి టిజి భరత్‌ను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని కలిసి విన్నవించారు. విజయపురం మండలం కోసలనగరంలో పారిశ్రామిక అభివృద్ధి పార్కును ఏర్పాటు చేయాలని, నగరి నియోజకవర్గంలో అధికంగా ఉన్న మరమగ్గ కార్మికుల కోసం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు ఓ ప్రకటనలో ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు.


సీహెచ్‌సీలో సిబ్బంది కొరత తీర్చండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు సీహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చాలని కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులను ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. గురువారం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులను ఆరాదీశారు. వైద్యులు సిబ్బంది కొరత ఉన్నట్లు గుర్తించి వెంటనే సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులను కోరారు.

తిరుమల తరహాలో తిరుచానూరు ఆలయ అభివృద్ధి

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు




అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. తిరుచానూరు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో గురువారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఆలయంలో ప్రస్తుతం ఉన్న ఐనామహల్, యాగశాల, పోటు, ప్రసాదాల పంపిణీ కౌంటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో వెంట జేఈవో వీరబ్రహ్మం, సిఈ నాగేశ్వరరావు, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్ఈఓ శైలజ



ప్రజాశక్తి-కోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వన మహోత్సవంలో శుక్రవారం మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం ఎంఈవో శైలజ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టిసిఎల్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ అధ్వర్యంలో ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని టిసిఎల్ టోర్నమెంట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. టోర్నీ విజేతగా బాలయపల్లి జట్టు, రన్నర్‌గా వాకాడు జట్టు నిలిచారు. గురువారం ప్రత్యేక కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ చేతుల మీదుగా షీల్డ్స్, మెడల్స్, బహుమతులను అందించారు. విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు కృషి చేసిన సంస్థ అధ్యక్షులు కడివేడు చంద్రశేఖర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరాజు, బాబు, మల్లికార్జున్ రెడ్డి, కరిముల్లా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్


ఏర్పేడు సిఐగా జయచంద్ర



సీఐ జయచంద్ర



ఎస్ఐ శివశంకర్



ఎస్ఐ అజయ్‌కుమార్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు సీఐగా ఎస్.జయచంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి వీఆర్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ శ్రీరామ శ్రీనివాసులు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

దొరవారిసత్రం ఎస్ఐగా అజయ్‌కుమార్

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం ఎస్ఐగా అజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిరుమలరావు తిరుపతి విఆర్‌కు బదిలీపై వెళ్లారు.

డక్కిలి ఎస్ఐగా శివశంకర్

ప్రజాశక్తి-డక్కిలి: డక్కిలి ఎస్ఐగా మొర్ల శివశంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై డక్కిలికి వచ్చారు.

వైకుంఠయాత్రకు ఉచిత రథం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన శాంతిరథాన్ని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు ప్రముఖ సామాజికవేత్త సైకం జయచంద్ర రెడ్డి, తుడా ఈఈ ఎన్‌వి కృష్ణారెడ్డి చేతుల మీదుగా గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి నగరంలో ఎవరైనా మరణిస్తే వారి పార్థివ దేహాన్ని వారి స్వస్థలానికి లేదా స్మశాన వాటికకు తీసుకు వెళ్లేందుకు ఉచితంగా వాహన సౌకర్యాన్ని శాంతిరథం పేరిట మానవతా సంస్థచే ప్రారంభించడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి ఉచితంగా బాడీ ఫ్రీజర్లను అందించడంతోపాటు రవాణా సౌకర్యార్థం ఉచితంగా శాంతి రథాన్ని కూడా ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా మానవతా అధ్యక్ష కార్యదర్శులు సివి రమణ సుకుమార్ రాజులు మాట్లాడుతూ నగర పరిధిలోని 10కిలోమీటర్ల వరకు శాంతి రథాన్ని ఉచితంగా అందిస్తారని 10కిలోమీటర్లు పైబడితే కేవలం ఇంధనం ఇస్తే వాహనాన్ని పంపడం జరుగుతుందన్నారు. వివరాల కోసం సెల్ నంబర్లు 9441449525, 6281433397లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు భార్గవ్, వేణుగోపాల్, గంగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయించాలని స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాలు నందు స్మార్ట్ సిటీ ఎం.డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ 35వ బోర్డు మీటింగ్ జరిగింది. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులను మౌర్య వివరించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తుడా ఇంచార్జ్ వి.సి.వెంకట నారాయణ, రామచంద్రారెడ్డి, రమాశ్రీ పాల్గొన్నారు. ఈ అండ్ సి బాలకష్ణా రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో యాత్రికులు, ప్రజల భద్రత దష్ట్యా సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, జి.ఎం.చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఇకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

జనశక్తి ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జనశక్తి ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు సంబంధించి పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను అళహరి సుధాకర్, తోకల అశోక్‌కుమార్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసారు. యూనియన్ ఏర్పాటు విషయంపై చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు.

2నుంచి సూళ్లూరుపేట డివిజన్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ అంకాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో గురువారం పెళ్లకూరు పిహెచ్‌సి పరిధిలో నెలబల్లి, పుల్లూరు సచివాలయాల్లో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. ఈ కార్యక్రమాల్లో పెళ్లకూరు పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ ఉమ, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ హరిత, సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రాంబాబు, కమలమ్మ, పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ పాల్గొన్నారు. సెప్టెంబర్ 2 నుంచి సూళ్లూరుపేట డివిజన్‌లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరిక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.